
గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జెఎసి నాయకులు

లగచర్లలో దాడి ఘటనపై కఠిన చర్యలకు ఆదేశించండి

- గవర్నర్‌కు తెలంగాణ ఉద్యోగుల జెఎసి విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లా లగచర్లలో ప్రభుత్వ అధికారులపై దాడికి పాల్పడ్డ కుట్రదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) డిమాండ్ చేసింది. ఈ మేరకు జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. లగచర్ల ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు వివరించారు. రైతుల మాటున కొందరు దుండగులు అధికారులపై దాడికి పాల్పడటమనేది రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిందని తెలిపారు. ఇలాంటి ఘటనలపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకూ అవి విస్తరించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సురక్షిత వాతావరణంలో విధులు నిర్వర్తించే పరిస్థితులు కల్పించేలా సంబంధిత అధికారవర్గాలను ఆదేశించాలని విన్నవించారు. జెఎసి ప్రస్తావించిన అంశాలపై గవర్నర్ సానుకూలంగా స్పందించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో జెఎసి నాయకులు డాక్టర్ నిర్మల, జిఎస్ కుమారస్వామి, కె.రామకృష్ణ, ఎస్.రాములు, రమేష్ పాక, మేడి రమేష్, దర్శన్‌గౌడ్, పూల్‌సింగ్ చౌహాన్, మహిపాల్‌రెడ్డి, అంజయ్య, రాబర్ట్ బ్రూస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీలు, బిసి సంఘాలు, మేధావుల సమావేశం

- డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నేడు అన్ని రాజకీయ పార్టీలు, బిసి సంఘాలు, మేధావులతో సమావేశం నిర్వహిస్తున్నట్టు బిసి డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్ల నిర్ధారణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ ప్రత్యేకంగా ఈ సమావేశాన్ని హైదరాబాద్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లోని నాలుగో అంతస్తులో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ, తమ తమ అభిప్రాయాలను కమిషన్‌కు తెలియజేయాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన కోరారు.

ప్రభుత్వ ఫార్మసిస్టుల సమస్యలను పరిష్కరించండి

- సిఎంకు తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ ఫార్మసిస్టుల సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డిని తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు సీఎంకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఫార్మసీ యాక్ట్ 1948, సెక్షన్ 42ని కఠినంగా అమలు చేయాలని కోరారు. డాక్టర్లను రెగ్యులర్ చేసినట్టుగానే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఫార్మసిస్టులను పరీక్షలు లేకుండా రెగ్యులర్ చేయాలని కోరారు. లేకపోతే 30 శాతం వెయిటేజీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పని ఒత్తిడి తగ్గించేందుకు వీలుగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు ఫార్మసిస్టులను నియమించాలని పేర్కొన్నారు. ప్రతి ఫార్మసిస్టు సర్వీస్ కాలంలో కనీసం నాలుగు పదోన్నతులు కల్పించాలని విన్నవించారు. తెలంగాణ ఏర్పడ్డాక గత పదేండ్లలో ఫార్మసిస్టుల ఒక్క సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయంలో ప్రాసెస్‌లో ఉన్న ఫార్మసీ ఆఫీసర్ ఫైలు తెప్పించి వెంటనే గెజిట్ ద్వారా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఫార్మసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేసి ఫార్మసిస్టుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

భారత విద్యార్థులపై యుఇఎల్ దృష్టి

- నగరంలో ఐఎబి ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్

భారత విద్యార్థులను ఆకర్షించడానికి పలు ప్రత్యేక సదుపాయాలను కల్పిస్తున్నట్లు యూనివర్శిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ (యుఇఎల్) ప్రతినిధులు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూనివర్శిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ అమండా జె బ్రోడెరిక్ మాట్లాడుతూ.. బ్రిటన్‌లో భారతీయ విద్యార్థుల భాగస్వామ్యం పెరుగుదల, యుఇఎల్‌లోనూ ఇక్కడి విద్యార్థుల సంఖ్య పెరగడంపై దృష్టి పెట్టామన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామన్నారు. విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేయడానికి హైదరాబాద్‌లో తమ ఇండస్ట్రీ అడ్వైజరీ బోర్డు (ఐఎబి)ని ప్రారంభించామన్నారు. దీంతో సమగ్ర విద్యను ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తమ యూనివర్శిటీలో డిగ్రీ, పిజి, పిహెచ్‌డి స్థాయిలో బిటెక్, ఎఐ, సైకాలజీ, బిజినెస్ కోర్సులను అందించడమే కాకుండా భవిష్యత్తు కెరీర్ ఎంపికను సులభతరం చేయనున్నామన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

అమీన్‌పూర్ మున్సిపాలిటీలో 'హైడ్రా' తనిఖీలు

- చెరువుల అలుగులు, తూముల పరిశీలన
- పెద్దచెరువు విస్తీర్ణంపైనా విచారణ
- హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. అమీన్‌పూర్ పెద్దచెరువు, శంభునికుంట, పద్మావతినగర్ కాలనీ, వెంకటరమణ కాలనీవాసుల ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతంలో పర్యటించిన కమిషనర్.. చెరువుల అలుగులు, తూములను పరిశీలించారు. పెద్ద చెరువు విస్తీర్ణంపైనా స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకట రమణ కాలనీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దచెరువు విస్తీర్ణం 99 ఎకరాలు ఉందని, చెరువు అలుగులు, తూములు మూసివేయడంతో చెరువులోకి వచ్చే నీరంతా బయటకు వచ్చి ప్రజల ప్లాట్లు మునిగిపోయాయనే ఫిర్యాదు మేరకు పరిశీలించామన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరిపి ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పద్మావతి నగర్ కాలనీలో మాజీ ఎమ్మెల్యే రాంభూపాల్ రెడ్డి కబ్జాపై ఫిర్యాదు వచ్చిందని, సర్వే చేయించి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. ఇదే కాలనీకి ఆనుకుని ఉన్న హెచ్ఎంటి స్వర్ణపురి కాలనీలో పార్కు కబ్జా అయినట్టు తెలిసిందన్నారు. శంభునికుంట చెరువు రెండు భాగాలుగా విభజించబడిందని, ఎఫ్‌టీఎల్‌లో భవనాలు నిర్మించారని, వీటిపై ఎన్‌జీటీలో ఉన్న కేసులను కూలంకుశంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెంకట రమణ కాలనీలో గోల్డెన్ కీ వారు కబ్జా చేసిన పార్కు స్థలాలను హైడ్రా అధికారులు ఇది వరకే సర్వే చేశారని, మరోసారి పరిశీలించి పార్కులు, ఓపెన్ స్థలం కబ్జా అయినట్టు నిర్ధారణ అయితే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. హైడ్రా ప్రధాన ఉద్దేశం చెరువుల పునరుద్ధరణ, రోడ్లను, పార్కులను ఆక్రమించకుండా చర్యలు తీసుకోవడమేనని, ఫిర్యాదు వచ్చిన వాటన్నింటిపై సర్వే చేయించి మూడు నెలల్లో తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పర్యటనలో ఆయన వెంట వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మారుస్తాం

- హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధి
- రూ.6 వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు
- కుట్రలు చేస్తే ఊచలు లెక్కించాల్సిందే
- కెసిఆర్ అనే మొక్కను మొలవనివ్వను
- కిషన్‌రెడ్డీ గుజరాత్ వెళ్లిపో..
- 'ఏడాది పాలన' వరంగల్ సభలో.. సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన ఆఖరి శ్వాస, చివరి రక్తపు బొట్టు వరకు రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతానని, కెసిఆర్ అనే మొక్కను మళ్లీ మొలవనివ్వనని సిఎం స్పష్టం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలను కోటీశ్వరులుగా చేయాలని వరంగల్ గడ్డపై ఈ సభను నిర్వహిస్తున్నామని, ఈ సభ మహిళలకే అంకితమన్నారు. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఏడాది ప్రజాపాలన పూర్తవుతున్న సందర్భంగా మంగళవారం హనుమకొండలో నిర్వహించిన విజయోత్సవ సభలో సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ముందుగా ఇందిరా మహిళా శక్తి మహిళా గ్రూపులు ఏర్పాటు చేసిన ఉత్పత్తుల మేళాను తిలకించారు. 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో సిఎం మాట్లాడుతూ.. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా కాళోజీ కళాక్షేత్రం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. పదేండ్లు వాళ్లు చేయని పనులను పది నెలల్లోనే కాంగ్రెస్ ప్రజాపాలనలో పూర్తి చేశామని, అందుకే వరంగల్ గడ్డపై ఈ విజయోత్సవ సభను నిర్వహించుకోవడం గర్వంగా ఉందని తెలిపారు. అంబానీ, అదానీలను తలదన్నేలా ఇందిరమ్మ రాజ్యంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

పదేండ్లు అధికారంలో ఉండి కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.. మంత్రి పొంగులేటితో చర్చించి కళాక్షేత్రాన్ని పూర్తి చేయడానికి నిధులు అడిగారని, దాంతో రూ.50 కోట్లు విడుదల చేసి పూర్తి చేయించి ఇప్పుడు ప్రారంభించుకున్నామని తెలిపారు. తాము చేసిన పనులు అభినందించకపోయినా, కాళ్లలో కట్టెలు పెట్టే ప్రయత్నం చేయొద్దని బిఆర్ఎస్ నేతలకు హితవు పలికారు. అలా చేస్తే వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవన్నారు. కెసిఆర్ చేతుల్లో మోసపోయి గోసపడుతుంటే హైదరాబాద్‌కు పోటీగా వరంగల్‌ను మహానగరంగా అభివృద్ధి చేయడానికి మంత్రి సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి పట్టుబట్టి నిధులు తెచ్చారన్నారు. ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మం జిల్లా కంటే కూడా వరంగల్‌పై దృష్టి సారించి అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేశారని, ఈ సందర్భంగా పొంగులేటిని అభినందించారు. వీరందరి తోడ్పాటు, తన మంత్రివర్గ సహచరుల కృషి వల్లే ఈరోజు వరంగల్ అభివృద్ధికి రూ.5,500 కోట్ల మేరకు నిధులు విడుదల చేశామని స్పష్టంచేశారు. వరంగల్ అభివృద్ధి చేస్తే సగం తెలంగాణను అభివృద్ధి చేసినట్టేనని తెలిపారు. వరంగల్, కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్‌ల్లో కొత్తగా ఎయిర్‌పోర్టులను ఏర్పాటు చేసుకోవాల్సి ఉందన్నారు. ఇందుకు ప్రజాప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

పది నెలల్లో ఏం చేశారని ప్రశ్నించిన వాళ్లకు సమాధానంగా పది నెలల్లో 50 వేల ఉద్యోగాలిచ్చామని రేవంత్‌రెడ్డి తెలిపారు. 23 లక్షల రైతు కుటుంబాలకు రూ.2 లక్షల రుణమాఫీ చేశామన్నారు. రూ.18,000 కోట్ల రుణాలను మాఫీ చేశామని, ఇంకా పలువురు రైతుల ఖాతాల్లో సమస్యలున్నాయని, వాటిని సరి చేసుకుంటే వాళ్లకు కూడా మాఫీ చేస్తామని తెలిపారు. ఈ రోజు తెలంగాణ రాష్ట్రంలో 66 లక్షల ఎకరాల్లో కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని పండించారని, ఇది దేశంలోనే రికార్డు ఉత్పత్తి అని స్పష్టం చేశారు. ఎమ్మెస్పీ ధర చెల్లించడమే కాకుండా సన్నాలకు రూ.500 బోనస్ చెల్లిస్తున్నామన్నారు.

విజయోత్సవ సభలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

కెసిఆర్.. రాహుల్‌గాంధీని చూసి నేర్చుకో..

మీ కుట్రలు, కుతంత్రాలన్నీ తెలుసని, కుక్క కాటుకు చెప్పు దెబ్బ మంత్రం తన వద్ద ఉందని, కుట్రలు చేస్తే ఊచలు లెక్కించాల్సిందేనని కెసిఆర్‌కు కౌంటర్ ఇచ్చారు. రాహుల్‌గాంధీని చూసి బుద్ధి తెచ్చుకోవాలని, మూడుసార్లు ఓడిపోయినా ఆయన ప్రజల మధ్యనే ఉండి కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని, కెసిఆర్ మాత్రం ఫామ్ హౌస్‌లో పడుకున్నాడని అన్నారు. అధికారంలో ఉంటే ప్రజల మధ్య ఉంటరు.. అధికారం పోతే ఫామ్ హౌస్‌లో పంటరా అని ఎద్దేవా చేశారు.

గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్ అభివృద్ధిని గొప్పగా చెప్పుకునే కిషన్‌రెడ్డి, మేం మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తే వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కిషన్‌రెడ్డి.. మోడీకి గులాంగా పనిచేస్తున్నారని, తెలంగాణను వ్యతిరేకించే మోడీకి గులామైన కిషన్‌రెడ్డికి తెలంగాణలో ఉండాల్సిన అర్హత లేదని, వెంటనే గుజరాత్‌కు వెళ్లిపోవాలన్నారు. కాళోజీ ఉంటే కిషన్‌రెడ్డి, కేసీఆర్‌ను పొలిమేరల్లో పాతిపెట్టేటోడన్నారు. జయశంకర్ సార్‌ను పదేండ్లపాటు సిద్ధాంతకర్తగా చెప్పుకొని ఆయన స్వగ్రామం అక్కంపేటను కేసీఆర్ రెవెన్యూ గ్రామంగా చేయలేకపోయారని, ఆ పని తమ ప్రభుత్వం చేసిందన్నారు.

మహిళాభివృద్ధే రాష్ట్రాభివృద్ధి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మహిళాభివృద్ధే రాష్ట్రాభివృద్ధి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రూ.6 వేల కోట్లను మంజూరు చేసి ఒకేరోజు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం దేశంలో ఎక్కడా జరగలేదని, తెలంగాణలోనే సాధ్యమైందన్నారు. ఒకే ఏడాదిలో రూ.25 వేల కోట్ల వడ్డీలేని రుణాలను మహిళలకు ఇవ్వాలని, వచ్చే ఐదేండ్లలో లక్ష కోట్లు ఇచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తిని మహిళా సంఘాలకు ఇవ్వడానికి ఈరోజు ఒప్పందం జరుగుతుందని తెలిపారు. పెట్టుబడిని బ్యాంకులతో ఇప్పించి, ఉత్పత్తిని ప్రభుత్వమే కొనుగోలు చేసి మహిళలను కోటీశ్వరులుగా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో వుందన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్‌లో కుర్చీ వేసుకొని ఇండ్లు కట్టిస్తనని మాటలు చెప్పి వెళ్లిపోయిండని, కుర్చీ వేసుకుంది లేదు.. కట్టించింది లేదన్నారు. చివరకు కనపడకుండా పోయాడన్నారు. వరంగల్‌లో కాళోజీ కళాక్షేత్రానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆరు నెలల్లోనే నిధులిచ్చి పూర్తి చేశారన్నారు. ఇందిరమ్మ రాజ్యం రావాలని నమ్మిన గడ్డ వరంగల్ అని వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

మేయర్ భర్తపై దాడికి ఖండన

- దాడులను ప్రోత్సహించడం సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ నగర మేయర్ దండు నీతు కిరణ్ భర్త దండు శేఖర్‌పై నగరంలోని నాగారం ప్రాంతంలో సోమవారం దాడి చేసి హత్యా ప్రయత్నం చేయటాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడులు చేయటం, హత్యాప్రయత్నాలు చేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, చర్చలు, చట్టసభల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవటానికి అవకాశం ఉందని తెలిపారు. కొద్దిమంది రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ప్రజల ఆస్తులను, భూములను స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. దాంతోపాటు ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్నారని, అటువంటి వారిపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం సకాలంలో చర్యలు తీసుకుంటే ఈ రకమైన అలజడులు జరగవని తెలిపారు. దండు శేఖర్‌పై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూర్జహాన్, నాయకులు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుని అరెస్ట్.. రిమాండ్

మేయర్ భర్తపై దాడికి పాల్పడిన నిందితుడు ఆటో డ్రైవర్ షేక్ రసూల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నాలుగు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్టు ఏసీపీ తెలిపారు.

మేయర్ భర్తను పరామర్శించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దండు శేఖర్‌ను మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్త పరామర్శించారు. దాడిని తీవ్రంగా ఖండించారు. నగర ప్రథమ పౌరురాలి భర్తకే రక్షణ లేకుంటే సామాన్య ప్రజలకు ఎలా రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, దాడికి పాల్పడిన నిందితుడిని, అందుకు ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మేయర్ దండు నీతు కిరణ్ కంటతడి పెట్టగా ఓదార్చారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ జిఒ రద్దు

- ఇప్పటికే రెగ్యులరైన వారిని తొలగించొద్దని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ జారీ చేసిన జిఒను హైకోర్టు రద్దు చేసింది. సెక్షన్ 10ఎ ప్రకారం తీసుకొచ్చిన జిఒ 16ను ఉన్నత న్యాయస్థానం మంగళవారం కొట్టివేసింది. డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో లెక్చరర్లను గతంలో ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారని.. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరుద్యోగులు హైకోర్టులో సవాల్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పునకు ఇది విరుద్ధమని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. విచారణ చేపట్టిన హైకోర్టు జిఒను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. ఇప్పటికే క్రమబద్ధీకరణ అయిన ఉద్యోగులను తొలగించవద్దని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఇకముందు భర్తీ చేసే ఉద్యోగాలన్నీ చట్ట ప్రకారం చేయాలని తెలిపింది. రాష్ట్రంలో ఇక నుంచి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకుండా నోటిఫికేషన్ల ద్వారా మాత్రమే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది.రాష్ట్రంలోని మొత్తం 40 విభాగాల్లో ఉన్న 5,544 కాంట్రాక్టు ఉద్యోగులను గత ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 2,909 మంది జూనియర్ లెక్చరర్లు, 184 మంది జూనియర్ లెక్చరర్లు (ఒకేషనల్), 390 మంది పాలిటెక్నిక్, 270 మంది డిగ్రీ లెక్చరర్లు, సాంకేతిక విద్యాశాఖలో 131 మంది అటెండర్లు, వైద్య ఆరోగ్యశాఖలో 837 మంది వైద్య సహాయకులు, 179 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 158 మంది ఫార్మాసిస్టులు, 230 మంది సహాయ శిక్షణ అధికారులు ఉన్నారు.

దేశాన్ని ప్రపంచ స్థాయిలో శక్తివంతంగా నిలబెట్టారు

- ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమంలో భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ స్థాయిలో భారత్‌ను శక్తివంతంగా నిలబెట్టడంలో ఇందిరాగాంధీ పాత్ర కీలకమైందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క గుర్తు చేశారు. దేశ సమగ్రత కోసం ఆమె ప్రాణాలు విడిచారని తెలిపారు. మహిళల ఉచిత రవాణా కోసం నెలకు రూ.400 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు వివరించారు. మహిళలకు ఇందిరమ్మ రుణాలు ఇవ్వబోతున్నట్టు వెల్లడించారు. దేశ సమగ్రతపై అవగాహన, వారి గురించి తెలియని వారు ఇందిరాగాంధీ చరిత్రను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. దేశ సమగ్రతను దెబ్బతీసేందుకు ఇందిరాగాంధీపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, టిపిసిసి కార్యనిర్వహక అధ్యక్షులు గీతారెడ్డితో


ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న భట్టి విక్రమార్క

కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'భారతదేశాన్ని అస్థిరపరచాలి... విభజించాలి' అనుకునే వాళ్లు మాత్రమే ఇందిరాగాంధీ చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని చెప్పారు. దేశ ప్రజలందరికీ సమానత్వం కల్పించాలనే లక్ష్యంతో భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు, 20 సూత్రాల అమలుతో సమ సమాజానికి పునాదులు వేశారని తెలిపారు. విదేశీ విధానంలో ఔన్నత్యాన్ని తీసుకువచ్చి ప్రపంచంలో భారత దేశాన్ని గొప్ప దేశంగా నిలబెట్టారని గుర్తు చేశారు. దేశం కోసం జాతి కోసం నిత్యం పరితపించిన ప్రజా నాయకురాలనీ చెప్పారు. రాజకీయ లబ్ధి కోసమే లగచెర్లలో అమాయకమైన రైతులను రెచ్చగొట్టి కుట్రపూరితంగా అధికారులపై దాడి చేయించారని తెలిపారు. బీఆర్ఎస్‌లా రైతుల నుంచి బలవంతంగా భూములను ప్రజా ప్రభుత్వం లాక్కోవడం లేదని చెప్పారు. రాష్ట్రంలో అసైన్ చేసిన 24 లక్షల ఎకరాల్లో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని పదివేల ఎకరాలకు పైబడి రైతుల నుంచి బలవంతంగా గుంజుకుని లే అవుట్ చేసి అమ్ముకున్న దుర్మార్గులని ఆరోపించారు. రైతుల భూములను బలవంతంగా గుంజుకుని వేలం వేసి పైశాచిక ఆనందం పొందారని విమర్శించారు. రైతుల గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. లగచర్లలోహింసనుప్రేరేపించి దాడులకు పురిగొల్పుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి జరగాలనే లక్ష్యంతో ఉన్నారని ఆయన గుర్తు చేశారు.

గ్రంథాలయంలో పోటీ పరీక్షల అభ్యర్థులకు సౌకర్యాలు కల్పిద్దాం

- అసిస్టెంట్ కలెక్టర్ పళని కదిరవన్

ప్రజాశక్తి కల్చరల్

పోటీ పరీక్షలకు సంసిద్ధమయ్యే అభ్యర్థులకు గ్రంథాలయంలో తాగు నీరు పరిశుభ్రమైన మరుగుదొడ్లు అవసరమైన పుస్తకాలు అన్నివిధాలా తగు సౌకర్యాలు అందిద్దామని హైదరాబాద్ అసిస్టెంట్ కలెక్టర్ గ్రంథాలయ సంస్థల ఇన్ ఛార్జ్ పళని కదిరవన్ సూచించారు. నగర గ్రంథాలయ సంస్థ నిర్వహణ లో అశోక్ నగర్ లోని వట్టికోట ఆళ్వారు స్వామి గ్రంథాలయం ఆడిటోరియం లో 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగ్అంగా ఇందిరా గాంధీ జయంతి ని పురస్కరించుకొని మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కదిరవన్ పాల్గొని సుదీర్ఘ కాలం గ్రంథాలయాల్లో ఉద్యోగులు గా అధికారులుగా పని చేసి పదవీ విరమణ చేసిన మహిళలను సత్కరించి అభినందించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ మాట్లడుతూ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రావలసిన నిధులు పూర్తి అండలేదనీ 250, మంది క్రమబద్ధమైన ఉద్యోగులు అవసరం కాగా కేవలం 66 మంది మాత్రమే వున్నారని చెప్పారు . గ్రంథాలయ వారోత్సవాలు క్రమం తప్పక నిర్వహిస్తూ వచ్చినా ఈ సారి పోటీ పరీక్షల అభ్యర్థులు వేడుకలు వారం రోజుల పాటు జరుపుతే వారికి ఇబ్బంది తో పాటు అసంతృప్తి వున్న వారివల్ల గొడవలు జరుగవచ్చు అని భావించి వేడుకగా చెయ్యటం లేదని తెలిపారు . గ్రంథాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించరు అన్న అపవాదు వుందని అది నిజం కాదనే విధంగా ఉద్యోగులు అందరూ ఉదయం 8, ఘంటలకు విధులకి రావాలనీ ఆమె కోరారు. గ్రంథాలయ ఉద్యోగులు సంఘం నాయకుడు అయోధ్య మాట్లడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రంథాలయాలకు ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. రావల్సిన పదోన్నతులు ఖాళీ గా వున్న పోస్టులలో నియామకాలు చెపట్టే విధం గా నూ ఔట్ సోర్సింగ్ కు బదులు కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకాలు జరిగే లా ప్రయత్నిద్దాం అని చెప్పారు. గ్రంథాలయ ఉద్యోగం ఎట్టి వత్తిడి లేనిదని కావున ఉద్యోగులు సమయ పాలన పాటించాలని అన్నారు. వేదిక పై విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు దేవేందర్ , ఫణి కుమార్ తదితరులు పాల్గొనగా రాజేంద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆర్‌టిసి కార్మిక సంఘాలపై ఆంక్షలు సరికాదు

- ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్.రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తేసి తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్.రావు, సిఐటియు హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం.వెంకటేష్ అన్నారు. ఆర్‌టిసిలో కార్మిక సంఘాలపై విధించిన ఆంక్షలు వెంటనే ఎత్తివేయాలని, కార్మికులపై యాజమాన్యం, ప్రభుత్వం వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్‌టిసి డిపోల ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించడంలో భాగంగా హైదరాబాద్‌లోని ఆర్‌టిసి బస్ భవన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా విఎస్.రావు, ఎం.వెంకటేష్ మాట్లాడుతూ.. ఆర్‌టిసి కార్మికుల ఐక్యతను విచ్ఛినం చేయడానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆందోళనలపై ఆంక్షలు విధించిందన్నారు. కార్మికులు ప్రశ్నించకుండా అణచివేయడం, ఆర్‌టిసిని తమ ఇష్టారాజ్యంగా నడపడానికి ఆ నిర్ణయం తీసుకున్నదని విమర్శించారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న డిపో మేనేజర్ల నుంచి ఉన్నతాధికారుల వరకు ఎవరికి వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.పని గంటలు పెంచి కార్మికులపై విపరీతంగా భారం వేశారన్నారు. వారంలో ఆరు రోజులు సింగిల్ క్రూ డ్యూటీలు చేస్తున్నారని వాపోయారు. సిబ్బంది సరిపోను లేరని, ఆఫ్‌లు క్యాన్సల్ చేయడంతోపాటు డబుల్ డ్యూటీలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్యూటీ ముగిశాక కూడా మరో ట్రిప్ వేయాలని వేధిస్తున్నారన్నారు. వీటిల్లో మహిళా ఉద్యోగులకు కూడా ఎలాంటి మినహాయింపులూ ఉండటం లేదన్నారు. నెలకు నాలుగు డబుల్ డ్యూటీలు కచ్చితంగా చేయాలని, అలా చేయనిపక్షంలో సెలవులు ఇవ్వబోమని, చర్యలు తీసుకుంటామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్మినెంట్ డ్యూటీ చార్టులో మార్పులు చేస్తామని ఓ డిపో మేనేజర్ బహిరంగంగా నోటీసు బోర్డులు వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'బిసి రిజర్వేషన్లను ఎబిసిడిఇగా వర్గీకరించాలి'

హైదరాబాద్ బ్యూరో : స్థానిక సంస్థల బిసి రిజర్వేషన్లను ఎబిసిడిఇగా వర్గీకరించాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బిసి డెడికేటెడ్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావుకి మేదరి మహేంద్ర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జరీగల శ్రీనివాస్, హైదరాబాద్ టిఆర్‌వీఎస్ అధ్యక్షులు చారకొండ వెంకటస్వామి తదితరులతో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

IN THE COURT OF THE HON'BLE VIII JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT HYDERABAD.
I.A. No. 1299 of 2019
in
O.S.No. 2370 of 2018

Between:
C.M.Praveen Raju S/o Narasimha Raju, aged 42 years, R/o H.No.18-6-162, Balagunj, Gowlipura, Hyderabad.
...Petitioner/Plaintiff.
AND
1.Hanuman Das Biyani S/o Papalal Biyani, aged 59 years, R/o 18-7-181/12/A, CIB Quarters, Gowlipura, Hyderabad.
2.Nelli Ashok S/o Sathaiah, aged 61 years, R/o 18-5-2836/284, Aliabad, Near Reddy Jana Sangham, Hyderabad.
..Respondents/Defendants.
To
1.Hanuman Das Biyani S/o Papalal Biyani, aged 59 years, R/o 18-7-181/12/A, CIB Quarters, Gowlipura, Hyderabad.
..Respondent/Defendant No.1.

Please take notice that the above I.A. filed by the petitioner/plaintiff under Section 5 of Limitation Act has been posted on 28.11.2024 for hearing. You are therefore directed to appear before the Honourable court at **10.30**A.M. on **28.11.2024** either in person or through your counsel. Failing which the matter will be decided in your absence.

//BY ORDER OF THE COURT//
Y. SATYANARAYANA,
Advocate.
Office at: Flat No.504, JSR Hyland, Near Netaji Park, Road No.16, Manikonda, Alkapur Township, Hyderabad-500089.
Cell No.:9441142956.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.P. NO. 20/2023

BETWEEN:
Varupula Pydiraju ....Petitioner / Debtor.
A ND:
K.Sivakrishna and 44 Others
......Respondents/ Creditors
TO.
R.1. Katragadda Sivarama Krisshna, S/o. Not known to the petitioner, Presently residing at Sivarma nagar Colony, Near Govt, Hospital, Tangadapalli Road, Choutappal, Yadadri Bhuvanagiri District, Telengana State, Ph.9492559468.
R.2. Chalumuri Malleswara Rao, Husband of Kondamma., Near Masjid, Bangaramma Gedda, Choutappal Post, Yadadri Bhuvanagiri District, Telangana State,
R.3. Linga Ranga Rao, Husband of Renuka, Presently residing at Hanuman Nagar, Choutappal Post, Yadadri Bhuvanagiri District, Telangana State
R.4. S.Shankara Narayana, Back side of HP Gas, Near Post Office, Choutappal Post, Yadadri Bhuvanagiri District, Telangana State. Ph.7013112150.
R.9. Lenka Appalanaidu, Husband of Venkata Lakshmi, Devis Employee, Opp. Annapurna rice mill, Sivaram Nagar Colony, Opp. Tangudubilli Road, Choutappal Post, Yadadri Bhuvanagiri District, Telangana State. Ph. 9494354462
R.16 Lenka Appalanaidu, Husband of Venkata Lakshmi, Devis Employee, Opp. Annapurna rice mill, Sivaram Nagar C?lonym, Opp. Tangudubilli Road, Choutappal Post, Yadadri Bhuvanagiri District, Telangana State. Ph. 9494354462
R.20. Taraka Ramu, Husaband of Taraka Manyamma, Devis Employee, Sivaram Nagar Colony, Nagulakunta, Tangudubilli Road, Choutappal Post, Yadadri Bhuvanagiri District, Telangana State. Ph.9640821470
R.21. Godala Syamala Rao, Husaband of Adilakshmi, Devis Employee, Near Malli Karjuna School. side of Katamayya Gudi, Opp. Valigonda Road, Choutappal Post, Yadadri Bhuvanagiri District, Telangana State. Ph.8500922132
R.25. Pothala Gnanesh S/o. Not known to the Petitioner, Devis Employee, Presently residing at Ganesh Nagar, Thangudubilli Road, Choutappal Post, Yadadri Bhuvanagiri District, Telangana State. Ph.8555996958.
R.26. Krishnamurthy, S/o. Not known to the Petitioner, Devis Employee, Opp. LIC Building, Near Lakkaram, Choutappal Post, Yadadri Bhuvanagiri District, Telangana State. Ph.7981791232.
R.32. Nethinti Lingamurty, S/o. Not known to the Petitioner, Devis Employee, Presently residing at Near Anjireddy Theater, vegitable Market area, Choutappal Post, Yadadri Bhuvanagiri District, Telangana State. Ph.9951032303.
R.33. Shek Farook, S/o. Not known to the Petitioner, Devis Employee. Near Masjid, Bangaru gadda, Choutappal Post, Yadadri Bhuvanagiri District, Telangana State. Ph.9247285811.
R.37. Veerla Ravi, S/o. Not known to the Petitioner, Devis Employee, Opp.SBI bank, Near ESI Hospital, Choutappal Post, Yadadri Bhuvanagiri District, Telangana State. Ph.9441941434.
R.39. Tadikonda Narayana Rao S/o. Not known to the Petitioner, Devis Employee, Sivalayam Street, Near Post office, High School road, Choutappal Post, Yadadri Bhuvanagiri District, Telangana State. PH.9490043485.
R.40. Velamala Manmadha Rao, S/o. Chinnayya, Kothagajuwaka Near Church Visakhapatnam. Ph.8019368070
R.41. Siddabatthula Abhilash S/o. Vijay Kumar, Syamalanagar Village, Guntoor. A.P.
R.43. Donda Anil, S/o. Not known to the Petitioner, Devis Employee, Presently residing at Choutappal Post, Yadadri Bhuvanagiri District, Telangana State A.P. Ph.7893765735.
R.44. Piduguralla Anjeneyulu, S/o. Not known to the Petitioner, Devis Employee, Near, Devis Labs, Ankireddy Gudem, Choutappal Post, Yadadri Bhuvanagiri District, Telangana State. Ph.9908370355.
R.45. Jala Upendra, S/o. Not known to the petitioner, Devis Employee, Ratna Nagar, Near Water tank, Choutappal, Yadadri Bhuvanagiri District, Telengana State. Ph.8008740264.

NOTICE

It is here by informed that the above named petitioner filed the above insolvency petition against the respondents praying the honorable court that to declare him as insolvent. It is therefore informed to all the above case (INSOLVENCY PETITON) is posted to **29-11-2024** and you are informed to attend before the Honorable court on that day at **10-30 A.M.** or otherwise you will be sef Ex-party.

M. RANGA RAJU,
Advocate,
SANTHI NAGARAM,
VIZIANAGARAM.
Cell : 9490365222

ఇది ప్రజా ప్రభుత్వామా? పోలీస్ రాజ్యమా?

- రైతులను కలిసేందుకు వస్తే ప్రభుత్వానికి భయమెందుకు?
- బాధితులను పరామర్శించేందుకు వస్తే అరెస్టు చేయడం దుర్మార్గం
- గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని ఫార్మా రైతులను పరామర్శించేందుకు వెళ్తున్న ప్రజాసంఘాల నాయకులను అడ్డుకోవడం దుర్మార్గమని, బాధితులను కలిసేందుకు వస్తే.. ప్రభుత్వానికి భయమెందుకని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ నాయక్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు ప్రశ్నించారు. మంగళవారం గిరిజన సంఘం, వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో లగచర్ల, హకింపేట్, పోలేపల్లి, రోటి బండతాండ, పులి కుంటతండా గ్రామాల్లోని ఫార్మా భూ బాధితులను కలిసేందుకు వెళ్తున్న నాయకులను తుంకిమెట్ల చౌరస్తా వద్ద భారీకేడ్లు వేసి అడ్డుకున్నారు. దాంతో పోలీసులు, ప్రజాసంఘాల నాయకుల మధ్య తోపులాట జరిగింది. ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేసి బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీ పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అభివృద్ధి పేరుతో ఫార్మా కంపెనీకి 300 ఎకరాలు.. దళితుల, గిరిజనుల, బలహీనవర్గాల భూములు ప్రభుత్వం తీసుకోవడం తో ఇక్కడి రైతులు నిర్వాసితులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలు మనుగడ సాగించలేదని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాల నాయకులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. లగచర్లలో అధికారులపై దాడి ఘటన పూర్తి బాధ్యత పోలీసులదేనని తెలిపారు. రాష్ట్రంలో నియంత పాలన పోయి.. ప్రజా పాలన వచ్చిందని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి లగచర్ల బాధితులను పరామర్శించేందుకు వెళు తున్న వారిని అరెస్టు చేయడాన్ని ఏమంటారో చెప్పాలని అన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీకి మధ్య ఉన్న రాజకీయ విభేదాలతో.. లగచర్ల రైతుల సమస్యను ముందు పెట్టుకుని రాజకీయ కక్ష సాధింపులు చేయడం తగదన్నారు. రైతులను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. శోభన్ నాయక్, సిఐటియు జిల్లా అధ్యక్షులు మహిపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. వెంకటయ్య, జిల్లా నాయకులు బుగ్గప్ప, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు జటావత్ శ్రీనివాస్ నాయక్, సిఐటియు ఉపాధ్యక్షులు చంద్రయ్య, నాయకులు శ్రీనివాస్, సత్తయ్య, రఘురాం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నేతలను అడ్డుకుంటున్న పోలీసులు, సంధ్యను అదుపులోకి తీసుకుంటున్న మహిళా పోలీసు

బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తుంటే అడ్డుకోవడం దారుణం : పిఒడబ్ల్యు జాతీయ కన్వీనర్ సంధ్య

ఇది ప్రజా ప్రభుత్వామా, పోలీస్ రాజ్యామా అని పిఒడబ్ల్యు జాతీయ కన్వీనర్ సంధ్య, రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ. సిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చిందని ప్రగతిభవన్ చుట్టూ కంచెలు తొలగించి అరాచకపు పాలనకు చరమగీతం పాడామని చెప్పిన సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు నియంతలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల, హక్కింపేట్, పోలేపల్లి, రోటి బాండ తండా, పులిచర్లకుంటా తండా గ్రామాల్లో బాధిత రైతులను పరామర్శించి నిజానిజాలను తెలుసుకునేందుకు వచ్చిన ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) నాయకులను తుంకిమెట్ల దగ్గర పోలీసులు అడ్డగించి వారిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించడంతో వారు రోడ్డుపై బైఠాయించారు. దాంతో పోలీసులు వారిని రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లగా పిఒడబ్ల్యు జాతీయ కన్వీనర్ సంధ్య బట్టలు చినగడంతో పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా స్వామ్యబద్ధంగా రైతు కుటుంబాలను పరామర్శించేందుకు వస్తే పోలీసులు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. రైతులు తమ భూములు ఇవ్వమంటే బలవంతంగా భూములు తీసుకోవాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. రాత్రుళ్లు భూ బాధిత రైతుల ఇండ్లకు వెళ్లి తలుపులు కొట్టి మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, దాంతో ఆయా గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. గ్రామాలు వదిలి వెళ్ళిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియంత పాలన పోయి ప్రజాస్వామ్య పాలన రావాలన్న ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరిస్తే ఇప్పుడు వారూ నియంతలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా పోలీసు అధికారులను ఇక్కడ గ్రామాల నుంచి పంపించి ప్రజలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి కేసులను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఒడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి గీత, జాతీయ నాయకురాలు ఝాన్సీ, ఇండిపెండెంట్ జర్నలిస్టు సజయ, జర్నలిజం ప్రొఫెసర్ పద్మజ, తెలంగాణ డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్ లేజి జోసెఫ్, నాయకులు మహేందర్. మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

పోలీసు బందోబస్తుతో ఫోర్త్ సిటీ రోడ్డు నిర్మాణానికి భూ సర్వే

- సమాచారం లేకుండా భూముల కొలతలు
- లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫోర్త్ సిటీలోకి రోడ్డు నిర్మాణం కోసం పోలీసుల బందోబస్తుతో అధికారులు మంగళవారం భూ సర్వే చేపట్టారు. రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వే చేపట్టడంతో వారు లబోదిబోమంటున్నారు. తమ పొలాల్లో సర్వే జరుగుతున్న సమాచారం తెలుసుకున్న రైతులు.. తమకు తెలియకుండా సర్వే ఎలా చేస్తారని రైతులు అధికారులను ప్రశ్నించారు. 330 అడుగుల రోడ్డు కాకుండా 200 అడుగుల రోడ్డు నిర్మాణం చేపట్టాలని, తద్వారా తమ భూమి ఎక్కువ నష్టం కాదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం ఆర్‌డిఒ అనంతరెడ్డి, ఎసిబి లక్ష్మీ కాంతంరెడ్డి, కందుకూరు సిఐ సీతారాం, మహేశ్వరం సిఐ, కందుకూరు, మహేశ్వరం ఎస్ఐలు, తహసీల్దార్ గోపాల్ బందోబస్తులో పాల్గొన్నారు. లగచర్ల ఘటన నేపథ్యంలో అధికారులు, పోలీసులు, ముందస్తుగానే అప్రమత్తమయ్యారు. సర్వే చేస్తున్న ప్రాంతానికి రైతులను రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. నాలుగు రోజుల నుంచి అధికారులు రోడ్డు నిర్మాణం కోసం భూ సర్వే చేస్తున్నారు. అప్పటినుంచి రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తమ భూములు తమకు తెలియకుండా భూ సర్వే ఎలా చేస్తారని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ. నాలుగు కోట్లు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

హైదరాబాద్‌కు సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ స్పేస్‌షిప్

హైదరాబాద్ : ఐటిసి సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ ఆధ్వర్యంలోని ఐకానిక్ ఫాంటసీ స్పేస్‌షిప్ వినూత్న ప్రచారాన్ని హైదరాబాద్‌కు చేర్చినట్లు తెలిపింది. పిల్లల్లోని ఊహలకు జీవం పోసేలా మద్దతునిచ్చే ఈ కార్యక్రమం బెంగళూరు, చెన్నైలలో విజయవంతమైందని పేర్కొంది. తన క్యాంపెయిన్ 'బింగ్ ఫాంటసీస్ : గివింగ్స్ టు యువర్ ఇమాజినేషన్'ను కొనసాగిస్తున్నట్లు తెలిపింది. నగరంలోని నాగార్జున మాంటిస్సోరి ఐబిటి కాన్సెప్ట్ స్కూల్‌లో ఈ కార్యక్రమం జరిగిందని పేర్కొంది. పిల్లల జీవితాన్ని సాధారణ స్థాయి నుంచి అసాధారణంగా మార్చేందుకు ఫాంటసీ ఊహాశక్తి కీలకమని ఆ సంస్థ ప్రతినిధి అలీ హారిస్ తెలిపారు.

21 నుంచి మత్స్యకార దినోత్సవాలు

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి 24 వరకు మత్స్యకారుల దినోత్సవాలను నిర్వహిస్తామని తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం గ్రౌండ్ దగ్గర, ఐమాక్స్ థియేటర్ పక్కన జరగబోయే ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి మత్స్యకారులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. ఉత్సవాలను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించను న్నారని తెలిపారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ హాజరుకానున్నట్టు తెలిపారు. ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్‌లో భాగంగా మత్స్యకారులు వివిధ రకాల ఫిష్ వంటకాలను ప్రదర్శిస్తారు. ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

వరంగల్‌కు ఉత్కర్ష్ ఎస్ఎఫ్‌బి విస్తరణ

హైదరాబాద్ : తమ నూతన బ్యాంకింగ్ అవుట్‌లెట్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేసినట్లు ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ తెలిపింది. ఈ సాంస్కృతిక నగరంలో కొత్త అవుట్‌లెట్‌ను తెరవడం సంతోషంగా ఉందని ఆ బ్యాంక్ ఎండి, సిఇఒ గోవింద్ సింగ్ పేర్కొన్నారు. దీంతో తెలంగాణలో ఐదు శాఖలకు, దేశంలో 986 బ్యాంకింగ్ అవుట్ లెట్‌లకు పెంచుకున్నట్లయ్యిందని పేర్కొంది.

కీళ్లనొప్పులకు చికిత్స పేరుతో మోసం

- డిసిఎ దాడుల్లో వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కీళ్ల నొప్పులకు చికిత్స పేరుతో ప్రచారం చేసుకుంటున్న రుమరిచ్ క్యాప్స్యూల్స్‌ను డ్రగ్ కంట్రోల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రంగారెడ్డి జిల్లా, హయత్‌నగర్, వనస్థలిపురంలోని ఆయుర్వేదిక్ రుమరిచ్ క్యాప్స్యూల్స్ పేరుతో ఆయుర్వేదిక్ మెడిసిన్ అమ్ముతున్నట్టు అధికారులు గుర్తించారు. ఇది కీళ్ల నొప్పుల చికిత్సకు పని చేస్తుందని తప్పుడు ప్రకటనలతో మోసం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం, కొహెడ విలేజ్, మోడ్గల్ ఆయుర్వేద్ ఫార్మసీ దీనిని తయారు చేస్తోంది. ఫలానా రోగాన్ని చికిత్స అంటూ తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు ఇవ్వడాన్ని డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అబ్జెక్షనబుల్ అడ్వర్టైజ్ మెంట్స్), యాక్ట్, 1954 కింద నిషేధం విధించారు. దీంతో అధికారులు వనస్థలిపురంలో సదరు క్యాప్స్యూల్ దొరికిన మెడికల్ షాపులో ఉన్న నిల్వలను సీజ్ చేశారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ప్రజాసంఘాల నాయకుల అరెస్టును ఖండిస్తున్నాం

- గిరిజనులపై నిర్బంధం ఆపాలి : వ్యకాస

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గిరిజనులను పరామర్శిం చడానికి వెళ్తున్న క్రమంలో ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండించింది. తంకిమెట్లలో అరెస్టు చేసి బొమ్మరాస్‌పేటకు తరలించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు, రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటయ్య, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. శ్రీరాం నాయక్, ఎం. ధర్మా నాయక్, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, జిల్లా నేతలు శ్రీను నాయక్, వెంకటయ్య, మహిపాల్ తదితరులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. మంగళవారం ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య, ఉపాధ్యక్షులు బి ప్రసాద్, బి పద్మ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, ప్రభుత్వాధికారులపై దాడికి పాల్పడిన ఘటనను ప్రజాస్వామ్య వాదులంతా ఖండించాల్సిందేనని పేర్కొన్నారు. అయితే, గిరిజనులకు, దళితులకు చెందిన సాగు భూములను లాక్కోవడం దుర్మార్గమని తెలిపారు. ఫార్మా కోసం భూ సేకరణ జరుగుతున్న గ్రామాల్లో ఇంటర్నెట్‌ను బంద్ చేయడం, సెల్‌ఫోన్లను ట్యాపింగ్ చేయడం, పేదలను నిర్బంధించడం ప్రజల జీవించే, మాట్లాడే హక్కులను హరించడమే అవుతుందని తెలిపారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాన్ని తొలగించి ప్రజాస్వామ్య వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- నల్లగొండ డిఎస్‌పి కె శివరాంరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ర్యాగింగ్‌కు పాల్పడితే ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని నల్లగొండ డిఎస్‌పి కె శివరాంరెడ్డి అన్నారు. ఈ నెల 11న సాయంత్రం నల్లగొండ మెడికల్ కాలేజ్ హాస్టల్‌లో సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేస్తూ, భౌతిక దాడి చేశారని కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ రామచంద్రు ఫిర్యాదు చేశారన్నారు ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బిఎన్ఎస్ సెక్షన్స్‌తోపాటు ర్యాగింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు మంగళవారం డిఎస్‌పి వెల్లడించారు. దాడికి పాల్పడిన వారిని విచారించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌పి శరత్ చంద్రపవార్ ఆదేశానుసారం మెడికల్ కాలేజీలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కాలేజీలు, హాస్టళ్లలో ర్యాగింగ్ లాంటి ఏమైనా జరిగితే వెంటనే పోలీసులకుగానీ, డయల్ 100కిగానీ సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. ర్యాగింగ్ భూతాన్ని సమిష్టిగా ప్రతి ఒక్కరూ పారదోలన్నారు.

అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ పాలన

- ఎంపి ఈటల రాజేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ పాలన నడుస్తున్నదని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ విమర్శించారు. ఏడాది కాలంలో ప్రజలకు ఏమిచ్చారని సంబురాలు చేసుకుంటున్నారని సిఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ముచ్చర్లలో ఫార్మాసిటీ కోసం హెలికాప్టర్లతో సర్వే చేయించి 14 వేల ఎకరాలు సేకరించారనీ, ఇంకా ఐదు వేల ఎకరాల భూమిపై కన్నేశారని విమర్శించారు. ప్రజాభిప్రాయ సేకరణ, హైకోర్టు ఆదేశానుసారం ముచ్చర్ల ఫార్మాసిటీని రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడు ఇలా చేయడమేంటని ప్రశ్నించారు. ఫోర్త్ సిటీ, హ్యాపెనింగ్ సిటీ పేరిట రియల్ ఎస్టేట్ మాఫియాతో మిలాఖత్ అయ్యి కోట్ల రూపాయల విలువ కలిగిన భూములను లాక్కుని రైతుల కళ్లల్లో మట్టికొట్టేందుకు సిఎం రేవంత్‌రెడ్డి డోర్లు ఓపెన్ చేశారని విమర్శించారు. లగచర్లలో భూములను ఇవ్వబోమని చెబుతున్న గిరిజనులను రాష్ట్ర ప్రభుత్వం బెదిరించడం దుర్మార్గమన్నారు. వికారాబాద్ కలెక్టర్ తనపై దాడి జరగలేదని చెబుతున్నా పేదలపై పోలీసులు దాడి చేసి థర్డ్ డిగ్రీ ప్రయోగించి వేధించడం అన్యాయమని చెప్పారు. హైడ్రా పేరుతో అన్ని అనుమతులున్న పేదల ఇళ్లను కూలగొట్టడాన్ని తప్పుబట్టారు. దాన్ని తెలంగాణ సమాజం ఛీత్కరించడంతో మూసీ ప్రక్షాళన పల్లవి ఎత్తుకున్నారని విమర్శించారు. మూసీకిరువైపులా ఉన్న విలువైన భూములను లాక్కొని.. మల్టీనేషనల్ కంపెనీలకు ఇచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కారు మహిళలకు, యువతకు, రైతులకు, జర్నలిస్టులకు, ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కొత్వాల్

బిఆర్ఎస్ పాలనలో అప్పులపాలు

- రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్న బిజెపి, బిఆర్ఎస్
- రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో అప్పుల్లో కూరుకుపోయిందని, కాంగ్రెస్ అధికారం చేపట్టాక సంక్షేమ పాలన అందిస్తోందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. మంగళవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బిఆర్ఎస్ చిన్నాభిన్నం చేసిందన్నారు. రూ.ఏడు లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పజెప్పితే ప్రతి నెలా ఏడు లక్షల రూపాయలు వడ్డీలే చెల్లిస్తున్నామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చేందుకు సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తోందన్నారు. పెద్దఎత్తున ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ, మూలనపడిన ఐటీఐలకు సాంకేతిక టెక్నాలజీని అనుసంధానం చేస్తూ ఉపాధికి బాటలు వేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇచ్చి యువతకు ఉపాధి కల్పిస్తున్నట్టు చెప్పారు. మహిళలకు రుణాలు ఇచ్చి కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బిజెపి, టిఆర్ఎస్ కుమ్మక్కై అడుగడుగునా అడ్డుపడుతున్నాయని ఆరోపించారు. కొత్త పరిశ్రమలను తీసుకురావాలనే ఉద్దేశంతో లగచర్లలో ఫార్మా కంపెనీల కోసం భూ సేకరణను చట్టం ప్రకారం రైతుల అనుమతితో తీసుకుంటుంటే ఒక కుట్రతో కలెక్టర్‌పై దాడికి ప్రణాళిక రూపొందించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు పార్టీలు కలిసి ఎన్ని కుట్రలు చేసినా సంక్షేమ పాలన ఆగదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జహీర్, మీడియా బెనహర్, సత్తుర్ చంద్రశేఖర్ గౌడ్, గంజి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ధరణి తప్పులపై 9న రాష్ట్ర సదస్సు

- తెలంగాణ రైతు కూలీ పోరాట సమితి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధరణిలోని తప్పులను - భూమాత డొల్ల తనాన్ని ఎత్తి చూపుతూ, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల తొమ్మిదిన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్టు తెలంగాణ రైతు కూలీ పోరాట సమితి (టిఆర్‌సిపిఎస్) తెలిపింది. ఈ మేరకు మంగళవారం పోరాట సమితి అధ్యక్షులు పటోళ్ల నాగిరెడ్డి, అరుణోదయ విమలక్క, న్యాయవాది కట్టా భగవంతరెడ్డి కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయటంలేదని తెలిపారు. రుణమాఫీ విషయంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. మూసి ప్రక్షాళనకు-ఫార్మా కంపెనీలకు పొసగదనీ, లగచర్ల ఘటనపై ప్రజా కమిటీ విచారణకు ఆదేశించాలని కోరారు. ఫార్మా కంపెనీలకు ఇచ్చిన అనుమతులన్నింటిని రద్దుచేసి హైదరాబాద్‌తో పాటు, సారవంతమైన తెలంగాణ భూములను రక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు- కూలీ పోరాట సమితి రాష్ట్ర నాయకులు: జి. వెంకటేశ్వరరావు , రవిచంద్ర, యాదయ్య, రమ, రమేష్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

బిసి-సి రిజర్వేషన్లను 10 శాతానికి పెంచండి : ఆర్ఎస్‌జె థామస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి-సి రిజర్వేషన్లను ఒక శాతం నుంచి 10 శాతానికి పెంచాలని జైస్వరాజ్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్‌జె థామస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళిత క్రైస్తవుల జనాభా పెరిగిందనీ, గతంలో ఇచ్చిన ఒక శాతాన్నే కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా 10 శాతానికి పెంచాల్సిన అసరముందని పేర్కొన్నారు. దళిత క్రైస్తవు లకు మైనార్టీల్లో ప్రత్యేక స్థానాలు కల్పించాలని కోరారు.

మూసీలోనే కాంగ్రెస్ మునిగిపోతుంది

- మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికార కాంగ్రెస్ పార్టీ మూసీలోనే మునిగిపోవడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీత విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ వచ్చే ఎన్నికలనాటికి బిఆర్ఎస్ ఉండబోదని జోస్యాలు చెబుతున్నారనీ, అది ఎప్పటికీ నెరవేరబోదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌ను ముంచడానికి రేవంత్, మహేష్ కుమార్‌గౌడ్ చాలని చెప్పారు. ప్రజల్లో ఎవరిని కదిలించినా రేవంత్ ప్రభుత్వం మీద ఆగ్రహం కట్టలు తెచ్చుకుంటున్నదని తెలిపారు. రుణమాఫీ విషయంలో ఆ విషయం బయట పడిందన్నారు. సమన్వయం లేకుండా కాంగ్రెస్ పాలన నడుస్తోందని చెప్పారు. ఇది భ్రష్టు పట్టిన పాలనని విమర్శించారు.

ఎక్సటెన్షన్ వద్దు-ప్రమోషన్ ముద్దు

- జలసౌధలో ఇంజనీర్ల నిరసన
- కార్యదర్శి రాహుల్ బొజ్జాకు వినతిపత్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ సమస్యలు పరిష్కరించాలంటూ సాగునీటి శాఖ ఇంజనీర్లు హైదరాబాద్‌లోని జలసౌధలో నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం ఆందోళన అనంతరం సాగునీటి శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇంజనీర్ ఇన్ చీఫ్ జి అనిల్‌కుమార్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. టిజిఇ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సహాధ్యక్షులు శ్యామ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రామారావు ఇందులో పాల్గొన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ సర్వీసు ఎక్సటెన్షన్లను సిఫారసు చేయకూడదని విజ్ఞప్తి చేశారు. శాఖలో ఒక చీఫ్ ఇంజనీర్ పోస్టుకు ఎక్స్‌టెన్షన్ ఇస్తే ఆరుగురి ప్రమోషన్లు అడ్డుకున్నట్టేనని ఈ సందర్భంగా తెలిపారు. ఎక్కువ కాలం సర్వీస్ చేసినా ప్రమోషన్ లేక దాదాపు 200 మంది ఇంజనీర్లు ఇబ్బంది పడుతున్నారని గుర్తు చేశారు. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఈ సందర్భంగా స్పందిస్తూ ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో ఇంజనీర్లు పాల్గొని మద్దతు తెలియజేశారని ఏటిఏఈఈ అసోసియేషన్ అధ్యక్షులు బండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నాగరాజు తెలియజేశారు.

ప్రజావాణికి 614 దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 614 దరఖాస్తులు అందాయి. మైనార్టీ వెల్ఫేర్ శాఖకు 210, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు 112, విద్యుత్ శాఖకు 75, రెవెన్యూ శాఖకు 65, హెూం శాఖ కు 38, ప్రవాసి ప్రజావాణికి 02, ఇతర శాఖలకు 112 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మహిళా సంఘాల నేతలపైనా దౌర్జన్యమా ? : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లగచర్లలో అర్ధరాత్రి గిరిజన ఆడబిడ్డలపై దమనకాండే చేయడమే కాకుండా పట్టపగలు వెళ్లిన మహిళా సంఘాల నేతలపైనా దౌర్జన్యమా? అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్వీట్ చేశారు. నిజనిర్ధారణకు వెళ్లిన వారిని కాంగ్రెస్ ఎందుకు అడ్డుకుంటోంది? వాస్తవాలను తొక్కిపెట్టాలని ఈ సర్కారు ఎందుకు ప్రయత్నిస్తోంది? సిఎం సొంత ఇలాకాలో ఇంతటి నిర్బంధం ఏమిటి? కొడంగల్ ఏమైనా పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉందా? లేక లగచర్ల చైనా బార్డర్లో ఉన్న కల్లోలిత ప్రాంతమా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేశారనీ, కొడంగల్‌కు వెళ్లే అన్ని దారుల్లో పోలీసుల పహారా ఏర్పాటు చేశారని విమర్శించారు. కాంగ్రెస్ దాచే ప్రయత్నం చేసినా నిజం దాగదని తెలిపారు. ఇప్పటికే లగచర్లలో కాంగ్రెస్ సర్కారు కిరాతకం ఢిల్లీకి చేరిందని, అక్కడ కాంగ్రెస్ అరాచకపర్వంపైనే తీవ్ర చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీలను అడ్డుకోవడం అంటేనే కాంగ్రెస్ సర్కారు తప్పుచేసినట్టు ఒప్పుకున్నట్టే లెక్క అని స్పష్టం చేశారు. మహిళా సంఘాలను అడ్డుకున్నందుకు క్షమాపణలు చెప్పాలనీ, లగచర్లలో నిర్బంధాన్ని ఎత్తేసి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

విశ్వకర్మ వృత్తిదారుల అభివృద్ధికి కృషి చేయాలి

- బడ్జెట్లో రూ.250 కోట్ల నిధులు కేటాయించాలి
- తెలంగాణ విశ్వకర్మ వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో విశ్వకర్మ వృత్తిదారుల వృత్తి రక్షణ, ఉపాధి, జీవిత భద్రత కోసం రూ.250 కోట్ల నిధులు కేటాయించి ఖర్చు చేయాలని తెలంగాణ విశ్వకర్మ వృత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని తెలుగు సంక్షేమ భవన్‌లో రాష్ట్ర బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌కు వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ విశ్వకర్మ వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి అధికారులతో సమావేశం జరిపి, ప్రభుత్వానికి నివేదిక అందజేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే బడ్జెట్‌లో న్యాయం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు లెల్లెల బాలకృష్ణ, సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కూరెళ్ళ నరసింహచారి, రాళ్లబండి కుమారస్వామి, ఉపాధ్యక్షులు యాదగిరి చారి, సహాయ కార్యదర్శి గుంటోజు భీష్మ చారి, రాష్ట్ర నాయకులు వెల్మలపల్లి వెంకటాచారి, జగదీశ్వరచారి, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్తలను అడ్డుకోవడం దుర్మార్గం

- మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజనిర్ధారణ కోసం లగచర్ల వెళ్లిన సామాజిక కార్యకర్తలు, పిఒడబ్ల్యు నాయకులు సంధ్య, ఇతర మహిళా సభ్యులను అడ్డుకోవడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కంచెలు, ఆంక్షలు, నిర్బంధాలు లేని పాలన అని చెప్పిన సిఎం రేవంత్.. అవి లేకుండా పాలన చేయలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. లగచర్లలో గిరిజన బిడ్డలకు జరిగిన అన్యాయం వెలుగు చూడకుండా ఎంత మందిని అడ్డుకుంటారు? అని ప్రశ్నించారు. అధికారం ఉందని అహంకారంతో సిఎం సాధారణ ప్రజలనే కాదు, జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలను నిర్బంధాలకు గురిచేస్తున్నారనీ, నిర్బంధ, నిరంకుశ, రాక్షస పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు.